



» వాణిజ్య పంటల వైపే రైతుల మొగ్గు » అవగాహన లేక ఆసక్తి చూపని వైనం
» ఎన్నో పోషకాలున్నా ప్రోత్సాహం కరువు » కనుమరుగవుతున్న సాంప్రదాయ పంటలు
» అధికారుల లెక్కల్లో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించని చిరుధాన్యాల సాగు

చిరుధాన్యాలపై చిన్నచూపు!



• మార్కెట్‌లో అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన చిరుధాన్యాలు

ఆదిలాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాణిజ్య పంటల సాగువైపు రైతులు మొగ్గు చూపడంతో చిరుధాన్యాలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు అధికంగా సాగైనా చిరుధాన్యాలు కాలక్రమంగా కనిపించకుండానే పోతున్నాయి. సాంప్రదాయ పంటల సాగును వదిలి ఆధునిక పద్ధతిలో అధిక దిగుబడులను ఇచ్చే వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో అక్కడక్కడ చిరుధాన్యాలను సాగు చేస్తున్న కనిష్ఠ స్థాయిలోనే కనిపిస్తుంది. ఈ యేడు వానకాలంలో జిల్లా సాగు విస్తీర్ణం 5లక్షల 72వేలు ఎకరాలు కాగా ఇందులో అధికంగా పత్తి పంట 4లక్షల ఎకరాలకు పైగా సాగవుతోంది. మిగితా ఎకరాలలో సోయా, కంది, జొన్న, మొక్కజొన్న, పెసర, మినుము, ఇతర పంటలు సాగవుతున్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. పత్తి పంట తర్వాత సోయా, కంది, పసుపు పంటలు నిలువగా చిరుధాన్యాల పంటల సాగు వెయ్యి ఎకరాల లోపే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జొన్న పంట సాగు కొంత పర్వాలేదనిపిస్తున్న కొర్రలు, సజ్జలు, రాగులు, సామలు, అండులు ఎకరం లోపే సాగవుతునట్లు తెలుస్తోంది. కానీ పరిస్థితులు మాత్రం దీనికి భిన్నంగానే కనిపిస్తున్నాయి. అధికారులు ఏదో అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం చిరుధాన్యాల సాగు కనిపించడం లేదంటున్నారు. మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో గుట్ట, కొండ ప్రాంతాల్లో కొన్నిరకాల చిరుధాన్యాలను సాగు చేస్తున్న వాటి వివరాలు మాత్రం బయటకు రావడం లేదు. అన్ని రకాల పంటల మాదిరిగానే చిరుధాన్యాల పంటల సాగుపై అన్నదాతల్లో అవగాహన కల్పించకపోవడంతో చిరుధాన్యాల సాగుపూర్తిగా కనుమరుగై పోయే పమాదం కనిపిస్తోంది.

• చిరుధాన్యాల జోలికి వెళ్లని రైతులు

ప్రతీయేటా వానకాల పంటల సాగులో అధికంగా పత్తి పంట సాగే కనిపిస్తోంది. గత రెండు మూడేళ్లుగా మద్దతుకు మించిన ధరలు పలుకడంతో రైతులు పత్తిని సాగుచేసేందుకే ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ప్రతీయేటా అధిక వర్షాలు, చీడపీడల ఉధృతితో ఆశించిన దిగుబడులు రాకపోయిన మళ్లీ పత్తి వైపే పరుగులు తీస్తున్నారు. ఎందుకంటే వాణిజ్య పంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండడం, అధిక లాభాలు రావడం, ఆధునిక పద్ధతుల్లో సాగు చేసే అవకాశం, మార్కెట్ సౌకర్యం అందు బాటులో ఉండడంతో రైతులు చిరుధాన్యాల జోలికి వెళ్లడం లేదు. అక్కడక్కడ వర్షాధార పంటలుగా చిరుధాన్యాలను సాగుచేస్తున్న మార్కెట్‌కు తరలించే స్థాయిలో కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితులతో పత్తి, సోయా, కంది పంటల సాగు పెరుగుతూ వస్తోంది. గడిచిన నాలు గైదేళ్లలో వాణిజ్య పంటల సాగు రెండింతలు అయినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈ పంటల సాగుతో అధిక పెట్టుబడులతో పాటు అధిక ఆదాయం కూడా చేతికి వచ్చే అవకాశం ఉంది. పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయని రైతులు నమ్ముతున్నారు. అసలు పెట్టుబడి ఖర్చులు లేకుండానే వర్షాదారంగా పండించే అవకాశంఉన్న చిరుధాన్యాలకు మార్కెట్ ఇబ్బందులతో పాటు ఆశించిన దిగుబడులు రావని అన్నదాతలు చెబుతున్నారు. ప్రభుత్వం చిరుధాన్యాలకు మద్దతు ధరలను ప్రకటించకపోవడం పెద్ద సమస్యగా మారుతోంది. అయితే ఎంతో ప్రాధాన్యత ఉన్న చిరుధాన్యాల సాగుపై రైతుల్లో కనీస అవగాహన కనిపించడం లేదు.

• రోగ నిరోధక శక్తి పెంపు

చిరుధాన్యాలలో ఎన్నోపోషక విలువలు ఉన్నా ప్రోత్సాహం కరువవుతోంది. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాల బారిన పడిన వారికి చిరుధాన్యాలు ఎంతో మేలు చేస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్, అస్తమా, కీళ్లనొప్పులు, ఇతర వ్యాధులతో బాధపడే వారికి రోగనిరోధక శక్తిని పెంచివ్యాధుల తీవ్రత పెరుగకుండా చిరుధాన్యాలు కట్టడి చేస్తాయని పేర్కొంటున్నారు. కరోనా సమయంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత కనిపించింది. గర్భిణులు, చిన్నపిల్లలకు మంచి పోషకాలను అందించి ఆరోగ్యవంతంగా ఉండేందుకు తోడ్పడుతాయని చెబుతున్నారు. ఇంత ప్రాధాన్యత ఉన్న చిరుధాన్యాల సాగుపై ప్రభుత్వం అధికారులకు పట్టింపే లేకుండాపోతోంది. వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తున్న సర్కారు చిరుధాన్యాలసాగుపై ఊసెత్తడంలేదు. ఇటీవల కాలంలో ప్రభుత్వం ఆయిల్‌పామ్‌లకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. దీంతో రైతులు పామాయిల్ సాగువైపు మొగ్గు చూపుతున్నారే తప్ప చిరుధాన్యాల జోలికి వెళ్లడంలేదు. ఇప్పుడిప్పుడే చిరుధాన్యాలపై ప్రజల్లో అవగాహన కనిపిస్తున్నా డిమాండ్‌కు సరిపడా దిగుబడులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది. చిరుధాన్యాల సాగుకు జిల్లా వాతావరణం అనుకూలమేన ప్రోత్సాహం, అవగాహన లేక అన్నదాతలు సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు.

ప్రభుత్వమే ప్రోత్సహించాలి

• కృష్ణారెడ్డి (రైతు, పొన్నారి తాంసి మండలం)



చిరుధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహించాలి. అలాగే ఈపంటల సాగును తప్పనిసరిగా చేయాలి. మళ్లీ సాంప్రదాయ పంటల సాగు మొదలైతేనే సమాజం ఆరోగ్యవంతంగా మారుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎందరో మంది మొండి రోగాల బారీనపడి లక్షల రూపాయలు ఆసుపత్రుల పాలవుతున్నాయి. దీంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా దెబ్బతింటున్నాయి. చిరుధాన్యాల సాగును పెంచాల్సిన అవసరం ఉంది. మొదట చిరుధాన్యాల ప్రాధాన్యతపై అధికారులకు అవగాహన ఉంటేనే రైతుల్లో అవగాహన వస్తుంది.

రైతులు ముందుకొస్తే సహకరిస్తాం

• శివకుమార్ (ఏఓ, ఆదిలాబాద్)

చిరుధాన్యాలను సాగుచేసేందుకు రైతులు ఎవరైనా ముందుకొస్తే పూర్తి సహకారాన్ని అందిస్తాం. చిరుధాన్యాలలో ఎన్నోపోషక విలువలున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏజెన్సీ గ్రామాల్లో తప్ప ఎక్కడ చిరుధాన్యాల సాగు కనిపించడం లేదు. ప్రతియేటా వానకాల సీజన్‌లో రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన విత్తనాలు, పంటల సాగు మెళకువలను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. భవిష్యత్తులో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంటుంది.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 29: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయలశంకర్ హాజరయ్యారు. ముందుగా మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారున. అనంతరం క్రీడాజ్యోతి వెలిగించి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ క్రీడాప్రాంగణంలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్, హాకీ కోసం ఆస్ట్రోటర్ఫ్, అంతర్జాతీయ ప్రమాణాలతో 50 మీటర్ల స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు ఆటలు ఎంతో దోహదం చేస్తాయని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన వారికి క్రీడాదుస్తులు అందించి సన్మానించారు. కార్యక్రమంలో క్రీడల అధికారులు వెంకటేశ్వర్లు, గోవర్ధన్‌రెడ్డి, ఆయా క్రీడాసంఘాల బాధ్యులు, కబడ్డీ అసోసియేషన్‌జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, కాంతరావు, హరిచరణ్ తదితరులున్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వినియోగదారులకు మెరుగైన సేవలు

• విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్‌చౌహాన్

ఆదిలాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్‌చౌహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సమస్యలను, విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని సమాచారాన్ని క్రోడీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వినియోగదారులకు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిస్కాంకు సంబంధించిన ప్రతీ సమాచారాన్ని తెలుసుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు టెక్నికల్ సమస్యలు తగ్గాయని, వ్యవసాయ పంపుసెట్లు, పరిశ్రామిక ఫీడర్లకు, లోవోల్టేజ్ ద్వారా విద్యుత్ మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్ బ్యాంకులు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. వర్షాలు, ఈదరు గాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ సరఫరాను అందించడం ద్వారా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, చాలా వరకు 33 కేవీ, 11కేవీ, ఇంటర్ లింకింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

ఘనంగా స్పోర్ట్స్‌డే వేడుకలు

నేరడిగొండ, ఆగస్టు29: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో గురువారం ప్రపంచస్పోర్ట్స్ డేతో పాటు తెలుగు మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో క్రీడాకారులను ఉపాధ్యాయులు, లెక్చరర్లు సన్మానించారు. మున్ముందు క్రీడల్లోరాణించాలని ఆకాంక్షించారు. అలాగే మాతృభాష గురించి వివరించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రత్యేక అధికారి రజిత, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐవో రవీందర్

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య: డీఈవో

తలమడుగు, ఆగస్టు29: ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యలభిస్తుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఉచిత విద్యతోపాటు పాఠ్య పుస్తకాలు, ఇతర మూలిక వసతులు అందిస్తున్నామన్నారు. జిల్లాలోనూ, ఉత్తమ ఫలితాలు ప్రభుత్వ కళాశాలలోనే వచ్చాయన్నారు. అనంతరం తలమడుగు కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయనకు డీఐవో రవీంద్రరావు, అధ్యాపకులు, గ్రామస్తులు సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

ఆదివాసీ కళాప్రతిభ పురస్కార పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్, ఆగస్టు29: మండల కేంద్రంలోని ఎమ్మెల్యేక్యాంపు ఆఫీసులో ఆదివాసుల సంక్షేమ సంఘం మూడో వార్షికోత్సవంలో భాగంగా ఆదివాసీ కళాప్రతిభ పురస్కారాల పోస్టర్లను ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాల ఆటపాటలతో కళాకారులకు ఉన్నత స్థానాలలో రాణించాలని దానికి తగిన ప్రోత్సాహం చేస్తామన్నారు. ఆదివాసీల సకల కళాసంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లెశ్రీధర్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాకారులు భీమ్‌రావు, సోయంనరేఉష్, ఆనంద్, ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కుల జాబితా ప్రదర్శన

గుడిహత్నూర్, ఆగస్టు29: మండలంలో తోషం కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక కోసం మార్కుల జాబితా గురువారం ప్రకటించినట్లు ఎంఈవో ఆర్.నారాయణ తెలిపారు. ఈ జాబితా ఎంఆర్సీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించడం జరిగిందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం సాయంత్రం 5గంటల లోపు తగిన ఆధారాలతో ఎంఈవోను సంప్రదించాలని పేర్కొన్నారు.

కవితక్కను కలిసిన చారులత

ఉట్నూర్, ఆగస్టు29: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఉట్నూర్ మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్ గురువారం కలుసుకొని పరామర్శించారు. కేసులో అక్రమంగా ఇరికించి జైలుకు పంపించారని ఆమె పేర్కొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

బోథ్, ఆగస్టు 29: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ ఆకుల నడిపన్న(80) గురువారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు బోథ్ ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు. గత కొంతకాలంగా నడిపన్న భార్య అనారోగ్యంతో ఉండడంతో తీవ్ర మనోవేదనతో తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుమారుడు రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాజీ సర్పంచ్ ఆకుల నడిపన్న మృతిచెందడంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి జోగురామన్న పరామర్శించారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ తులశ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డిలు, పలువురు నాయకులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

తలమడుగు, ఆగస్టు29: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కజ్జర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొమ్మ జ్యోతి అన్నారు. గురువారం తలమడుగు మండలంలోని కజ్జర్ల పాఠశాలలో క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పాఠశాల హెచ్‌ఎం కొమ్ము జ్యోతి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మీనాక్షి, శ్రీలత, శంకర్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులను లెక్కించి.. నమోదు చేసి..!

• ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాల నమోదు • కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి అప్‌లోడ్ చేస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

ఇచ్చోడ, ఆగస్టు 29: రైతు రుణమాఫీ సమస్యలపై జిల్లాలోని మండలాల స్థాయిల్లో చేపట్టిన ప్రజావాణికి దరఖాస్తులు పోటెత్తాయి. వీటితోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ నుంచి అందిన వివరాల ఆధారంగా క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు రైతుల కుటుంబ వివరాలు ప్రత్యేకంగా సేకరిస్తున్నారు.

• పోర్టల్‌లో వివరాల నమోదు

కుటుంబ నిర్ధారణ సమస్యపై అందించిన దరఖాస్తులపై సర్వే ప్రక్రియ జిల్లాలో మంగళవారం నుంచే మొదలైంది. దరఖాస్తుల కుటుంబ సభ్యులను గ్రామాపంచాయితీ కార్యాలయానికి పిలిపిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో కుటుంబనిర్ధారణ చేపట్టారు. వీటితోపాటు రూ.2లక్షల పైన రుణం, సమాచార లోపం, ఆధార్‌లో పేర్ల తప్పులు, బ్యాంకులు, పీఏసీఎస్‌లలో తప్పులు, పొరపాట్లు, పట్టాదారు పాసుపుస్తకం, రుణ ఖాతాల్లో తప్పులు వంటి వాటిని బ్యాంకుల అధికారులే పరిష్కరించనున్నారు. సుమారు పది రకాల సమస్యలపై జిల్లాలో వేలాది దరఖాస్తులందాయి. సమస్యలున్న ఫ్యామిలి గ్రూపింగ్, రేషన్‌కార్డు లేని వారికి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేకంగా వివరాలు సేకరిస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల నుంచి అందిన జాబితా ఆధారంగా ఏఓలు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) గ్రామ పంచాయతీల వారిగా అక్కడి కార్యాలయాలకు గత రెండు రోజులుగా పిలిపిస్తున్నారు. ఆధార్‌కార్డు ఆధారంగా రేషన్‌కార్డు లేని కుటుంబాల వివరాలను, మ్యారీడ్, అన్‌మ్యారీడ్ విభజించి ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటివరకు కొంతమంది రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే పూర్తయింది. సర్వే వివరాలను అన్‌లైన్ పోర్టల్‌లో అధికారులు పొందుపర్చారు.



ఇచ్చోడలో రైతు వివరాలు, సెల్ఫీ తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఓ

ఘనంగా అన్నబాహుసాటే జయంతి

ఉట్నూర్, ఆగస్టు29: మండలంలోని షాంపూర్‌లో అన్నబాహుసాటే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దళిత రత్న కాటం రమేష్, బావ్‌సాటే అధ్యక్షుడు జాదవ్‌రాందాస్, బాలాజి, మాజీ సర్పంచ్ గుండాల మల్లిక, మాజీ సర్పంచ్ కవ్డెకర్ కేశవ్, మల్లిక, జగదీశ్, జాదవ్‌అంకుశ్, పాండురంగ్, రాములు, యువరాజ్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

క్రీడా సామాగ్రి పంపిణీ

బోథ్, ఆగస్టు29: మండలంలోని సోనాల గ్రామ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని తులసి భాష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల అరుణ్‌కుమార్ గురువారం విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందించారు.

రిమ్స్ భద్రతపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు29: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ భద్రతపై జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ప్రత్యేక దృష్టిసారించారు. ఇటీవల కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకొని గురువారం రిమ్స్‌లో భద్రతలో భాగంగా సీసీ కెమెరాలతోపాటు ప్రతీ విభాగాన్ని ఎస్పీ ప్రత్యేకంగా పరిశీలించారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌ని కలిసి పలు విభాగాలను పరిశీలించి వివరాలు సేకరించారు. రిమ్స్ ఆడిటోరియంలో యాంటి ర్యాగింగ్, మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్య నేరమని, ర్యాగింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సైబర్‌క్రైమ్ నివారణ సైబర్ క్రైమ జరుగు పద్ధతులపై, డ్రగ్స్ వినియోగం నివారణ లాంటి అంశాలపై సవివరంగా ఉండే పోస్టర్లను ఆవిష్కరించారు. డ్రగ్స్‌వాడను, డ్రగ్‌ఫ్రీ సొసైటీ ఏర్పాటుకు కృషి చేస్తాను, డ్రగ్స్‌పై ఎటువంటి సమాచారాన్ని తెలియజేస్తానని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిం చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేంద ర్‌రెడ్డి, టీఎస్ న్యాబ్ టీఎస్పీ ఎం.పద్మనాభం, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సై, రిమ్స్ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్, సూపరింటెండెంట్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం



• సీసీ టీవీని పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్





ప్రబలుతున్న విష జ్వరాలు

● రోజుకు 10 మంది ఆస్పత్రిలో చేరిక

ఉట్నూర్, ఆగస్టు 29: ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీలోని గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాలు ఆగిపోయి ఎండలు మండిపోతుండడంతో వాతావరణ పరిస్థితులు మారి జ్వరాలు ఊపందుకుంటున్నాయి. ఏజెన్సీలోని ఉట్నూర్, నార్నూర్, జైనూర్ మండలాల నుంచి రోగులు ఉట్నూర్ ఆసుపత్రికి చేరుకుంటున్నారు. రోజుకు ఓపీలో 30 నుంచి 40 మంది జ్వరాల కోసం వైద్యం వస్తుండగా పది మందిని ఆసుపత్రిలో చేరుస్తున్నారు.


ఉట్నూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కాళ్ల నొప్పులు, నడుము నొప్పితో రోగులు ఆసుపత్రిలో చేరుతున్నారు. గురువారం ఒక్కరోజు హస్నాపురం చెందిన నిఖిలేష్, ఫాతిమా, గంగన్నపేటకు చెందిన సాయిహారతి, నాగపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్, అల్లంపల్లి చెందిన భీమ్రావు, ఉట్నూర్‌కు చెందిన మహమ్మద్ బిన్ సలాం, జైనూర్ ఆశపల్లికి చెందిన ప్రేమలాభాయి, కొమ్ముగూడెంకు చెందిన కార్తిక్, ఆశపల్లికి చెందిన జానుభాయిలు ఆసుపత్రిలో చేరి వైద్యం అందుకుంటున్నారు. వైరల్ జ్వరాలతో బాధితులు వస్తున్నారని తీవ్రంగా జ్వరం ఉన్న వారిని ఆసుపత్రిలో చేర్చుకుని పూర్తి వైద్యం అందిస్తున్నామని ఉట్నూర్ ఆసుపత్రి రీజినల్ మెడికల్ ఆఫీసర్ బానోత్ మహేందర్ తెలిపారు.






విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, ఆగస్టు 29: పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ సాగర్ అన్నారు. ఫివర్ సర్వేలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బుగ్గారం గ్రామంలో గల టీటీడబ్ల్యుఆర్ఎస్ బాలికల పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు తినే ముందు తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న, ఫార్మాసిస్టు ఓంప్రకాష్, ఏఎన్ఎం సుజాత, జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని బొడ్డిగూడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలి జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని లేదంటే నీటిలో దోమల వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ పవార్, సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కన్వీనర్లు

వార్డుల వారీగా సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవరావు

బోథ్, ఆగస్టు 29: ఈనెల 31న పోలింగ్ బూత్‌లో వెళ్లి సభ్యత్వ నమోదు కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవరావు అసెంబ్లీ కన్వీనర్ బాబురావు పటేల్ పేర్కొన్నారు. గురువారం మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే నెల 5 నుంచి పోలింగ్ బూత్ ఇన్‌చార్జీలు, అధ్యక్షులు ఆయా బూత్‌ల పరిధిలో గల కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతీ బూత్ పరిధిలో 250 సభ్యత్వం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సుభాష్, సూర్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు రోహిత్, మానాల శేఖర్, ఓబీసీ నియోజకవర్గ నాయకులు తూము సూర్యం, జగజీరావు, విజయ్, మడినారాయణ, లవకుశ, ప్రవీణ్, నల్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.






ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న వార్డు ప్రజలు

సాయినగర్ కాలనీని ప్రత్యేక వార్డుగా గుర్తించాలి

బోథ్, ఆగస్టు 29 : నూతనంగా ఏర్పడిన సాయినగర్ కాలనీని ప్రత్యేక వార్డుగా గుర్తించాలని మాజీ వార్డు సభ్యుడు షేక్ షాకీర్ ఎంపీడీవో జీవన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సాయినగర్ కాలనీ ప్రజలు వివిధ వార్డుల్లో నుంచి వచ్చి నివాసమున్నందున వారికి సరైన వసతులు ఉండటం లేదన్నారు. ప్రత్యేక వార్డుగా గుర్తించినట్లయితే రానున్న పంచాయతీ ఎన్నికల్లో సాయినగర్ కాలనీ ప్రజలు వారిలో నుంచి ఒకరిని వార్డు సభ్యుడిగా గెలిపించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హసీఫ్, రాజేందర్, మున్నిఫ్, ప్రేమ్‌సింగ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.






కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 29: ఐకేపీ వీవోఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు చిన్నన్న డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అర్హులైన వీవోఏలకు సీసీలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు

దళితబంధు యూనిట్ల తనిఖీ

తలమడుగు, ఆగస్టు29: మండలంలోని డోర్లి గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం కింద 18 మంది లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయగా గురువారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్‌రావు మండలంలోని డోర్లి గ్రామానికి వెళ్లి లబ్ధిదారులకు ఇచ్చిన యూనిట్‌లను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాట్లాడుతూ దళితబంధు యూనిట్లను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరివెంట సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్, ఆగస్టు 29: లోకప్రవీణ్‌రెడ్డి, అల్లూరి రాజుల ఆధ్వర్యంలో 15వ వార్డు భగత్‌సింగ్‌నగర్, 4వార్డు బంగారుగూడ నుంచి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేదలు, గరీబోళ్ల పార్టీ అని, తాము పాలకులం కాదు సేవకులమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాక్లె, కౌన్సిలర్లు బండారి సతీష్, నందనర్సింగ్, ఆవుల వెంకన్న, రామ్‌కుమార్, దర్శనాల లక్ష్మణ్, జాఫర్‌అహ్మద్, నాయకులు బుర్లశంకరయ్య, క్యాతం శ్రీప్రసాద్ రెడ్డి, శ్రీరామ్, దినేష్‌గౌడ్, కొండూరి రవి, నిమ్మల ప్రభాకర్, కయ్యూమ్ తదితరులున్నారు.

'పార్టీ బలోపేతానికి బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి'

తలమడుగు, ఆగస్టు29: జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించేలా బూత్ లెవల్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్ హాజరై ప్రసంగించారు. తలమడుగు మండలానికి కాకుండా బోథ్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఇన్‌చార్జిని నియమించి పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించాలని పార్టీ కార్యకర్తలు ఆదినాథ్‌ను కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్రకాంత్, మండల అధ్యక్షులుస్వామి, ఉపాధ్యక్షులు ధనుంజయ్, బీజేవైఎం మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, పొట్టి పెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు29: షరతుల్లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు షరతులతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. అనంతరం కలెక్టరే రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు.

కొట్నాక భీంరావు చేసిన కృషిని

ఆదివాసీ సమాజం మరవదు

● ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ● భీంరావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఆదివాసీ నాయకులు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఆగస్టు29: గిరిజనుల్లో మొదటి తరం రాజకీయ నాయకుడు, ఆదివాసీ జాతిలో ఉన్నత విద్యను అభ్యసించిన విద్యావంతుడు మాజీ మంత్రి కొట్నాక భీంరావు 22 వర్ధంతిని రాజ్‌గోండు సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఆదివాసీ నాయకులు సాంప్రదాయబద్ధంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ కొట్నాక భీంరావు ఆదివాసీ సమాజం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఆదివాసుల అభివృద్ధి కోసం ఐటీడీఏల ఏర్పాటుకు అలాగే ఆశ్రమ పాఠశాల ఏర్పాటుకు కొట్నాక భీంరావు చేసిన కృషిని ఎప్పటికి ఆదివాసీ సమాజం మరవదని అన్నారు. గిరిజన ప్రజలకు ఐటీడీఏ ద్వారా పించన్ రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీమంత్రి కొట్నాక భీంరావు గిరిజనుల అభివృద్ధికీ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఎన్నికల లో ప్రచారంచేసి ఈ ప్రాంతప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచానని అన్నారు. ఈ ప్రాంతంలో సేవలు అందించిన ఎమ్మెల్యే విగ్రహాలను ఏర్పాటుచేయడానికి కృషిచేస్తానన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పిన మహనీయుడని అన్నారు. గిరిజన ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాలలో గిరిజన విద్యార్థుల విద్యకోసం వసతి గృహాలను ఏర్పాటు చేయించారన్నారు. జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి మాట్లాడుతూ ఎక్స్‌రోడ్డులో నిర్మించిన పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, మహిళ కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరిబాయి, అదనపు జిల్లా వైద్యాధికారి కుడిమెత మనోహర్, రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విఠంరావు, జిల్లా కార్యదర్శి గోడంనీరంజన్, జిల్లామేడి మేస్రం దుర్గపటేల్, ఆత్రంభాస్కర్, పలు సంఘాల నాయకులు, తదితరులు కొట్నాక్ భీమ్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యుత్ బకాయిలు కట్టాల్సిందే..

● విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ లక్ష్మణ్

నార్నూర్, ఆగస్టు 29: గృహ అవసరాల కోసం వాడే విద్యుత్‌లో పెండింగ్ బిల్లు బకాయిలు ఉంటే కట్టాల్సిందే అని విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు వాడే వారికి ప్రభుత్వం జీరో బిల్లు ప్రకటించిన విషయం అందరికి తెలిసిందే. కాని గతంలో ఉన్నవిద్యుత్ బిల్లు బకాయిలు మాత్రం కట్టవల్సిందేనని ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో శ్రావణ్ సబ్ ఇంజనీర్, చొక్కరెడ్డి ఎల్ఐ రవీందర్ ఎల్ఎం శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 29: జిల్లాకేంద్రంలోని తీర్పెల్లి వద్ద జాతీయ రహదారిని ఎమ్మెల్యే పాయల శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ నిలిచిపోయిన పనుల ప్రాంతాన్ని సందర్శించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిలిచిన రహదారి పనులు పూర్తి కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆయనవెంట ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

వృద్ధుల పట్ల సేవా భావం కలిగి ఉండాలి

తలమడుగు, ఆగస్టు29 : వృద్ధుల పట్ల ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని రిటైర్డ్ డీఎస్పీ శివప్రసాద్ కోరారు. గురువారం మండలంలోని సాయి లింగ వృద్ధాశమంలో తన సోదరుడు నిజామాబాద్ వాస్తవ్యుడు శివచరణ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సాయి లింగి వృద్ధాశ్రమంలో అన్నదానం, వృద్ధులకు పండ్లు, వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ అధ్యక్షుడు దెబ్బడి అశోక్, వృద్ధుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు లేక బడికి తాళం!

● బడిబయటే విద్యార్థులు

నార్నూర్, ఆగస్టు 29: ఐటీడీఏ పరిధి ఏజెన్సీ ప్రాంత గిరిజన మండలాల్లో ఉన్న టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత గిరిజన ప్రాంత విద్యార్థులకు శాపంగా మారుతోంది. తాజాగా గురువారం మండలంలోని బాబేఝరి గ్రామంలో గల పాఠశాలకు వారం రోజులుగా ఉపాధ్యాయుడు లేక తాళం వేసి ఉంటోంది. గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో కూర్చుని ఉపాధ్యాయుడు కోసం ఎదురుచూస్తున్నారు. గత వారం క్రితం జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఈ పాఠశాల ఉపాధ్యాయుడు వేరేచోట బదిలీ అయ్యాడు. అయితే ఆయన స్థానంలో ఎవరూ రాక, ఉపాధ్యాయుడు లేక బడికి తాళం వేసి ఉంటోంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా తమ గ్రామానికి ఉపాధ్యాయుడిని నియమించకపోవడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. ఐటీడీఏ పీవో తమ గ్రామాన్ని సందర్శించి ఇక్కడున్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిపక్షంలో నిరసన చేపడతామని హెచ్చరిస్తున్నారు.



బడికి తాళం ఉండడంతో బడి బయటే ఆడుకుంటున్న పిల్లలు, గడ్డిమోపుతో మరో విద్యార్థి



కప్పర్ల పాఠశాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలి

● ఆర్డీవో వినోద్‌కుమార్

తాంసి, ఆగస్టు29: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆర్డీవో వినోద్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. తాంసి మండలంలోని కప్పర్ల ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వారి వారి విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధి కోసం యువత తమవంతు సహకారం అందించాలని అన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ లక్ష్మీ, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన సెక్టోరల్ అధికారి



పాఠశాలలు చేపట్టిన పనులను పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి

బోథ్, ఆగస్టు29: మండలంలోని కౌటా(బి) గ్రామంలోని ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా సెక్టోరల్ అధికారి నారాయణ పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించి అవసరమైన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో అకామిడేషన్ సరిపోవడం లేదని నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పూర్తిచేసేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా ప్రమాణాలను సెక్టోరల్ అధికారి పరిశీలించారు. మధ్యాహ్న నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చూడాలని కోరారు.

జడ్పీ సీఈవోని కలిసిన నేతలు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 29: ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సీఈఓగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన జితేందర్‌రెడ్డిని గురువారం జైనథ్ మండల మాజీ జడ్పీటీసీ తుమ్మల అరుందతి- వెంకట్‌రెడ్డి, ఆదివాసీ మహిళ నాయకురాలు శ్రీలేఖ, బోయన్‌వార్‌గంగారెడ్డి, ప్రశాత్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం

బోథ్, ఆగస్టు 29: మండలంలోని సోనాల ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా పాఠశాలలో తెలుగు భాషపై ఉపన్యాస పోటీలను నిర్వహి ంచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి బోరే మురళీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు గొల్లపెల్లి రమేష్ రచించిన శ్రీరామ శకతం పుస్తకం గురించి రచయిత వివరించారు. కార్యక్రమ ంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆర్.ప్రకాష్ పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన బోరే మురళీధర్ తెలుగు భాష గొప్పతనం విద్యార్థులకు వివరించారు.

పేద ప్రజల కనీస అవసరాలు తీర్చడమే నా లక్ష్యం

● ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల, ఆగస్టు, 29 : పేద ప్రజలకు అవసమైన విద్య, వైద్యంతో పాటు రైతులకు సాగునీరు అందించడంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల స్థానిక రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రజలకు వివిధ కారణాలతో ఆసుపత్రిలో ఖర్చయిన డబ్బులను సీఎం సహాయనిధి నుండి మంజూరు కాగా చెక్కులను బాధితులకు అందజేశారు. అనంతరం మండలంలో ఆయా గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలను ఎంపీపీ అప్కగజ్జారాంతో పాటు పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే రోజుల్లో మండలంలో సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలు చేయాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి సగం మంది కూడా రుణమాఫీ జరగలేదన్నారు. తక్షణమే రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతేరాజు కాదు రైతును రాజు చేయడమే తన లక్ష్యమన్నారు. అధికారులందరూ పేద ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించేందుకు కృషి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోబోమన్నారు. మండలంలోని ఆయా గ్రామాల రోడ్ల మరమ్మతులకు నిదులు మంజూరైన వాటి పనులను సత్వరమే ప్రారంభించాలని లేదంటే కాంట్రాక్టర్ టెండరు రద్దు చేసి మరో కాంట్రాక్టర్‌కు టెండరు అప్పగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అప్కగజ్జారాం యాదవ్, జిల్లా నాయకులు రమణరావు, స్థానిక నాయకలు వెంగల్ రావు, పసుల నవీన్, ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్‌తో పాటు పలు శాఖల అధికారులు, పలు గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

దిలావర్‌పూర్, ఆగస్టు 29 : దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం నాటికి 38వ రోజుకు చేరుకున్నాయి. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం నిలిపి వేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నిర్మల్ కవులకు 'గిడుగు' జాతీయ సాహితీ పురస్కారాలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు కవులు గురువారం 'గిడుగు' రామ్మూర్తి పంతులు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జాతీయ సేవా పురస్కారాలను అందించారు. పోలీసు భీమేష్, తుమ్మల దేవరావు కవిత్వ విభాగంలో, నేరెళ్ల హనుమంతు, తోడిశెట్టి పరమేశ్వర్ సేవా రంగంలో పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆయన మనుమరాలు కాంతికృష్ణ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

'రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ వెంటనే చేయాలి'

ఖానాపూర్, ఆగస్టు 29 : అర్హులైన రైతులందరికీ 2 లక్షలు రుణమాఫీ చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య అన్నారు. గురువారం తహసీల్దార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రైతు భరోసా, పంటల బీమా, రైతు బీమా పథకాలను ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి అమలు చేయాలని, రైతులకు అవసరమైన కొత్త రుణాలు ఇవ్వాలని, అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, ధరణి సమస్యలు పరిష్కరించి పోడు భూములకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలన్నారు. ఏఐపీకేఎస్ మండల అధ్యక్షుడు ఎం. అంకుష్ రావు, ఏఐపీకేఎస్ మండల నాయకులు జక్కు రాజన్న తదితరులున్నారు.

రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌కు యత్నం



బాధితురాలు రజిత



బైక్‌పై పారిపోతున్న చైన్ స్నాచర్స్

భైంసా, ఆగస్టు 29: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో గురువారం రెండు చోట్ల చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకున్నాయి. రెండు ఘటనల్లోనూ మహిళల మెడల్లో నుంచి బంగారు గొలుసులను తెంపేందుకు చైన్ స్నాచర్స్ యత్నించారు. . అయితే రెండు చోట్ల బాధిత మహిళలు అప్రమత్తతతో వ్యవహరించి ప్రతిఘటించారు.ఒక చోట జరిగిన ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లకపోగా మరో చోట జరిగిన ఘటనలో రూ.1.8 లక్షలకు పైగా విలువచేసే బంగారు గొలుసులు అపహరణకు గురయ్యాయి. స్థానిక జుల్పేకర్ గల్లిలో ఉదయం రాణి అనే మహిళ బీడీ కంపెనీకి నడుచుకుంటూ వెలుతోంది. ఈ సమయంలో వెనుకవైపు నుంచి బైక్ పై వచ్చిన ఇద్దరు చైన్ స్నాచర్స్ ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కునేందుకు యత్నించారు. దీంతో అప్రమత్తమైన మహిళ బంగారు గొలుసు తెగిపోకుండా గట్టిగా అదిమి పట్టుకోంది. అంతేకాకుండా దొంగ దొంగ అంటూ అరిచింది. దీంతో చైన్ స్నాచర్స్ ఘటన స్థలి నుంచి బైక్‌పై వేగంగా పారిపోయారు .అక్కడి నుంచి పారిపోయిన చైన్‌స్నాచర్స్ స్థానిక కమలా థియేటర్ సమీపంలో మరో ఘటనకు పాల్పడ్డారు. స్థానిక గోకుల్‌నగర్ కాలనీ పరిధిలో అద్దెకు ఉంటున్న రజిత అనే యువతి కమలా థియేటర్ రోడ్డు మార్గంలో నడుచుకుంటూ వెలుతోంది. వెనుకవైపు నుంచి బైక్‌పై వచ్చిన స్నాచర్స్ యువతి మేడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసు, మరో తులం బంగారు చైన్‌ను తెంపుకునేందుకు యత్నించారు. దీంతో యువతి అప్రమత్తమై ప్రతిఘటించింది. బంగారు గొలుసులు తెగిపోకుండా గట్టిగా పట్టుకుంది. అప్పటికే రెండు గొలుసులు తెగిపోగా పుస్తెలతాడుతో కూడిన బంగారు గొలుసు అర్ధబాగం , మరో బంగారు గొలుసు పూర్తి భాగం చైన్ స్నాచర్ చేతికి చిక్కగా వారు వాటిని అందుకొని అక్కడి నుంచి బైక్ పై వేగంగా పారిపోయారు. పుస్తెలతాడుతో కూడిన బంగారు గొలుసు అర్ధబాగం యువతి గట్టిగా పట్టుకోవడంతో ఆమే చేతిలో మిగిలింది. క్షణం వ్యవధిలో చోటు చేసుకున్న ఘటన నుంచి తేరుకున్న యువతి దొంగ దొంగ అని అరచే సమయానికే చైన్ స్నాచర్స్ అక్కడి నుంచి ఉడాయించారు. ఇది గమనించిన పలువురు స్థానికులు చైన్‌స్నాచర్స్‌ను పట్టుకునేందుకు యత్నించగా వారికి చిక్కకుండా బైక్‌పై వాయు వేగంతో పారిపోయారు. బాధిత యువతి రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు, ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించి చైన్‌స్నాచర్స్‌ను పట్టుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు.

● నెలలో రెండవ ఘటన

పట్టణ పరిధిలో తొలుత ఈ నెల 3వ తేదిన చైన్ స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. స్థానిక రాహల్‌నగర్ కాలనీ పరిధిలో బి. లక్ష్మీ అనే మహిళ స్థానిక నిర్మల్ క్రాస్ రోడ్డు మార్గంలోని శివాజీ చౌక్ నుంచి ఇంటికి వెళ్తుండగా స్నాచింగ్ బారిన పడింది. నిర్మల్ నుంచి వచ్చిన సదరు మహిళ శివాజీ చౌక్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెల్తుండగా ... పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకొని ఉడాయించారు. సంబంధిత ఘటన మరిచిపోకముందే మరో ఘటన చోటు చేసుకుంది. గురువారం ఒకే రోజు ఏకంగా రెండు చోట్ల చైన్ స్నాచర్స్ చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనలతో పట్టణ పరిధిలో మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి.

మద్యం దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

నిర్మల్ టౌన్, ఆగస్టు 29 : మద్యం దుకాణాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలముఠాను నిర్మల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం డీఎస్పీ గంగారెడ్డి వివరాలను వెల్లడించారు. నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో దొంగతనానికి పాల్పడిన నలుగురు దొంగలను అరెస్ట్ చేశామన్నారు. స్థానిక వైఎస్ఆర్ కాలనీలో నివాసముండే రాపెన్వాడ్ రఘు, ఉత్తం పాండురంగ పవార్, మక్కల శ్రీను, జాదవ్ దిలీప్, రాపని సోనీ లు మిత్రులు రోజు సాయంత్రం వారి పనుల అనంతరం కలిసి మద్యం తాగేవారు. రోజువారీ కూలీ పని చేసే వీరు కూలీ పని వల్ల వచ్చే డబ్బులు వారు మద్యం తాగుటకు, జల్సాలకు వారి కుటుంబ పోషణకు సరిపోలేదు. దీంతో జల్సాలకు డబ్బులు, మద్యం కావాలంటే వైన్స్‌షాపుల్లో దొంగతనం చేయాలని నిశ్చయించుకున్నారు. మొదటగా పథకం ప్రకారం స్థానిక మయూరి హోటల్ వద్ద గల శ్రీ వెంకటేశ్వర వైన్స్, ఖానాపూర్ రోడ్‌లోని సిరివైన్స్‌లో దొంగతనం చేశారు. అదే విధంగా మంగళవారం రాత్రి సోఫీనగర్‌లోని సాయివైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో దొంగతనానికి వెళ్లి రెస్టారెంట్‌లో ఉన్న కెమెరాలు దానికి సంబంధించిన టీవీని పగులగొట్టి, తలుపు, షట్టర్ తాళాలు కూడా రాడ్లతో పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.40,000 నగదు, ఒక కంప్యూటర్, కొన్ని మద్యం బాటిళ్లు దొంగలించారు. మరునాడు కేసు నమోదు చేసిన నిర్మల్ పట్టణ పోలీసులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సీసీఎస్ పోలీసుల సహకారంతో కేవలం 24 గంటల్లోనే దొంగతనం చేసిన రాపెన్వాడ్ రఘు, ఉత్తం పాండురంగ పవర్, మక్కల శ్రీను, జాదవ్ దిలీప్‌లను ఎంతో కష్టపడి చాకచక్యంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని పట్టుకుని విచారించగా వారు చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్నారు. జల్సాలకు అలవాటు పడి దొంగతనం చేసిన డబ్బులను జల్సాలకి ఖర్చు చేసి, మిగిలిన సొత్తును పోలీసులు వారి వద్ద నుంచి రెండు వేల రూపాయలు స్వాధీనపరుచుకొని వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులలో రాపని సోనీ పరారీలో ఉందని తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీసుస్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మల్ టౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... పట్టణ ప్రజలు ప్రతీ ఒక్కరూ తమ తమ వ్యాపార సముదాయాలు, నివాసాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వాటివల్ల నేరాలను అదుపు చేయవచ్చని కోరారు. జిల్లా పోలీస్ సిబ్బంది రాత్రి, పగలు అలర్ట్‌గా ఉన్నారన్నారు. దీనికి గత వారం రోజుల్లో పట్టుకున్న దొంగలే ఉదాహరణ అని అన్నారు. 24 గంటల్లోనే ఈ దొంగతనం ఛేదించి దొంగని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ టౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు సాయికృష్ణ, ఎం. రవి, రమేష్ నేతృత్వంలో సౌకత్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ తిరుపతి, గణేష్, హోంగార్డు సతీష్‌లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అభినందించారు.

నిర్మల్ జిల్లాలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



దిలావర్‌పూర్‌లో క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎస్సై



సిర్గాపూర్‌లో విద్యార్థుల ప్రదర్శన

నిర్మల్ జిల్లాలో గురువారం జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

దిలావర్‌పూర్, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో క్రీడా పోటీలు, క్విజ్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అంబాజీ విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదానందం, స్థానిక ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, గ్రామస్పెషల్ ఆఫీసర్ గోవర్దన్, ఈవో చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని సిర్గాపూర్ ప్లేర్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిత్య జీవితంలో వివిధ క్రీడల ప్రాముఖ్యతపై అతిథులు ప్రసంగించారు. పాఠశాల కరస్పాండెంట్ కేవీ. నరసింహారెడ్డి మాట్లాడుతూ... క్రీడల వలన శారీరక, మానసిక ఆరోగ్యం అలవాటు అవుతుందన్నారు.

క్రీడాకారులకు స్ఫూర్తి ధ్యాన్ చంద్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : హాకీ క్రీడాకారులకు ధ్యాన్‌చంద్ స్ఫూర్తి దాయకుడని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. గురువారం ధ్యాన్ చంద్ 119 జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ పాల్గొన్నారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హాకీ క్రీడను విశ్వజనీనం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. యువత హాకీ క్రీడ పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్, బి. శ్రీకాంత్, ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, పేట అధ్యక్షుడు భూక్యా రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుడిని సన్మానించిన అదనపు కలెక్టర్

జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెట్ క్రీడా కారుడు జాదవ్ ఒమేష్‌ను గురువారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఘనంగా సన్మా నించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాలువాతో పాటు జ్ఞాపిక అందజేశారు. సుదర్శన్ జాదవ్, లక్కీ పాల్గొన్నారు.






అడ్డగోలుగా రిజిస్ట్రేషన్‌లు

- జిల్లాలో నిబంధనలు బేఖాతరు
- శిఖం, బఫర్ జోన్‌లలో సైతం దర్జాగా రిజిస్ట్రేషన్లు
- కాసులకు అధికారుల కక్కుర్తి
- ఉన్నతాధికారుల తనిఖీలు శూన్యం

నిర్మల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన నిర్మల్‌లో తాము తలుచుకుంటే ఎలాంటి భూమినైనా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు అందుబాటులో ఉందన్న ఆరోపణలున్నాయి. ఇక్కడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సి బ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గత కొంతకాలంగా అడ్డగోలు రిజిస్ట్రేషన్‌లను కొనసాగిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములకే కాకుండా నిషేధంలో ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూముల్లో కూడా కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్‌లను ఏర్పాటు చేసి అందులోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు చేసి ఇస్తున్నారంటున్నారు. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారుల అండతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరీ రెచ్చిపోయి అడ్డగోలు దందాను నిర్భయంగా సాగిస్తున్నారంటున్నారు. భూముల నిషేధాన్ని వాటికి సంబంధించిన మెమోలను పక్కన పెట్టి కాసులే ధ్యేయంగా ఈ వ్యవహారాన్ని నిర్భయంగా నిర్వహిస్తున్నారంటున్నారు. కొద్దిరోజుల క్రితం ఇక్కడి ఓ జూనియర్ అసిస్టెంట్ అక్రమ రిజిస్ట్రేషన్‌ల కోంచం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారానికి ముందు విజిలెన్స్ అధికారులు సైతం ఇక్కడి కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై వేటు వేసిన సంగతి తెలిసిందే. కాగా గత కొంతకాలం నుంచి జిల్లాలో భూముల ధరలు ఆకాశానికంటడడం అటు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇటు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు వరంగా మారిందంటున్నారు.



ముఖ్యం గా జిల్లాకేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి ఇక్కడి భూములు బంగారంలా మారిపోయాయి. ఇదే అదనుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి లే అవుట్ అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వెంచర్‌లను ఏర్పాటు చేయడం, అందులోని ప్లాట్లను అడ్డగోలుగా విక్రయించడం లాంటి వ్యవహారాలు సాధారణమైపోయాయి. కాగా మరికొంతమంది చెరువు భూములను ఆక్రమించి వెంచర్‌లు వేసి ఆ భూముల పక్కనున్న పట్టా భూముల సర్వే నంబర్‌లతో రిజిస్ట్రేషన్‌లు చేయించినట్లు విమర్శలున్నాయి. అయితే ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ల సమయంలో సంబంధిత కార్యాలయానికి సంబంధించిన అధికారి క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాల్సి ఉంటుంది. అలాగే క్రయ విక్రయాలు జరిగే ప్లాట్ల సర్వేనంబర్‌లు నిషేధిత జాబితాలో ఉన్నాయా లేదా అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోకి కూడా ఆ భూములు వస్తాయో రావోననే అంశాన్ని కూడా నిగ్గు తేల్చాల్సి ఉంటుంది. అయితే నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ అధికారులు వాటన్నింటిని పక్కన పెట్టి డబ్బులే లక్ష్యంగా ఎలాం టి భూమినైనా నిరభ్యంతరంగా రిజిస్ట్రేషన్ చేస్తారని అంటున్నారు. అయితే ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో వ్యవహారమంతా వ్యూహాత్మకంగా కొనసాగుతుందని అంటున్నారు. అధికారులు, సిబ్బంది కుమ్మక్కై రియల్ ఎస్టేట్ వ్యాపారులతో బేరసారాలు సాగించి ఈ అవకతవకలకు పాల్పడుతున్నారంటున్నారు. అయితే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ పథకం ప్రకారం ప్రతీనెల కొద్ది రోజుల పాటు సెలవు పెట్టడం, ఆ సెలవు రోజుల్లో మరో సీనియర్ సిబ్బంది ఇన్‌చార్జిగా వ్యవహరించడం పరిపాటిగా మారిందని అంటున్నారు. ఈ ఇన్‌చార్జీ సబ్ రిజిస్ట్రార్ పెండింగ్‌లో ఉన్న అన్ని డాక్యుమెంట్లను ఒకే రోజు రిజిస్ట్రేషన్‌లు చేయడం సాధారణమైందని అంటున్నారు. ఈ వ్యవహారం వెనక లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి.

నిబంధనలు బేఖాతరు

ఇదిలా ఉండగా నిర్మల్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారంటున్నారు. 2019 సంవత్సరంలో మెమో నంబర్ 1457ను ప్రభుత్వం అవకతవకల నివారణకు జారీ చేసింది. అయితే అక్రమ లే అవుట్లలో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దన్న నిబంధన ఉంది. ఆ నిబంధనను ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు తుంగలో తొక్కుతున్నారంటున్నారు. దీంతో పాటు చెరువు శిఖం, బఫర్‌జోన్ భూముల్లో కూడా రిజిస్ట్రేషన్‌లు చేయరాదన్న నిబంధనలున్నాయి. అయితే అధికారులు మాత్రం వీటన్నింటినీ పట్టించుకోకుండా కాసులకు కక్కుర్తి పడి ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్‌లు చేశారంటున్నారు. ప్రభుత్వం గాని ఉన్నతాధికారులు గాని పలుసార్లు అక్రమ రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి హెచ్చరికలు జారీ చేసినప్పటికి ఆ హెచ్చరికలన్నీ బుట్టదాఖలవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. కొంతమంది ఇక్కడి రిజిస్ట్రేషన్ అధికారులకు రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో వారు నిర్భయంగా ఈ అక్రమాలను కొనసాగిస్తున్నారంటున్నారు. రియ ల్ ఎస్టేట్ వ్యవహారంలో రాజకీయ నేతలు సైతం పరోక్షంగా భాగస్వామ్యం కలిగి ఉన్న కారణంగా వారు తమ మాట వినేందు కోసం అధి కారులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఉన్నతాధికారుల తనిఖీలు పూజ్యం

రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సక్రమంగా తనిఖీలు చేయకపోవడంతో ఇక్కడి అధికారులంతా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణమవుతోందని అంటున్నారు. ముఖ్యంగా ఈ శాఖలోని విజిలెన్స్ విభాగం కూడా ఆశించిన మేరకు తనిఖీలు, పర్యవేక్షణ చేపట్టకపోవడం అక్రమార్కులకు వరంగా మారుతోందని అంటున్నారు. గతంలో నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విభాగం తనిఖీలు చేసి చర్యలకు సిఫారసులు చేసింది. అయితే ఆ సిఫారసులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు జరగలేదు. ఇలాంటి వ్యవహారాలన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు వరంగా మారాయంటున్నారు. ఓ వైపు ఉన్నతాధికారుల అండదండలు పరోక్షంగా లభిస్తుండడమే కాకుండా అక్రమ రియల్ వెంచర్‌లు ఏర్పాటు చేసే రాజకీయ నేతల మద్దతు ఉండడంతో ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణమవుతోందని అంటున్నారు.

జిల్లాను ఎయిడ్స్ రహితంగా మార్చాలి

● జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేందర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : జిల్లాను ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దామని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రాజేందర్ అన్నారు. గురువారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్‌ఎంలకు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు ముమ్మరంగా పరీక్షలు జరుపాలన్నారు. బాధితులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వారిపట్ల వివక్ష చూపవద్దన్నారు. మానసిక ధైర్యం కల్పించి హెచ్‌ఐవీ నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ నాగరాజు, పీవో రాజారమేష్, మీడియా అధికారి బి. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతతో మెరుగైన సేవలు

● ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాస్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : విద్యుత్ వినియోగదారులకు అధునాతన సాంకేతికత వినియోగిస్తూ మెరుగైన సేవలందిస్తున్నామని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయంపై రియల్ టైం డేటా క్రోడీకరించి వాస్తవ గణాంకాల ఆధారంగా విశదీకరించి అంతరాయం కలుగకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నామని, అంతరాయాలు కనిష్ఠ స్థాయికి తీసుకొచ్చామని తెలిపారు. స్టోర్ వినియోగం ప్రవేశపెట్టామని, డిస్కంకు సంబంధించిన ప్రతి సమాచారం చూసే డాష్ బోర్డు అప్లికేషన్ పెంపొందించేందుకు సూచనలు చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలో రియాక్టివ్ పవర్ కంపెన్సేషన్ ద్వారా పవర్ ఫ్యాక్టరీ గణనీయంగా మెరుగుపరిచేందుకు కెపాసిటర్ బ్యాంకులు దోహదపడతాయన్నారు. 33 కేవీ, 11 కేవీ ఇంటర్లింకింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న వైద్యుడు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 29 : జిల్లాకేంద్రానికి చెందిన వైద్యుడు దేవేందర్‌రెడ్డి ఓ నిరుపేదకు ఉచితంగా వైద్యం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణానికి చెందిన చొక్కాల శంకర్ వృత్తిరీత్యా ఆలయ పూజారి. నెల రోజుల క్రితం కాలికి గాయమై.. తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఏ ఆధారం లేని ఆ వ్యక్తిని కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు దేవుడిపైనే భారం వేశారు. ఈ సమాచారం తెలుసుకున్న డా. దేవేందర్‌రెడ్డి తన ఆసుపత్రిలో శంకర్‌కు చికిత్స అందించేందుకు ముందుకొచ్చారు. 15 రోజుల పాటు ఐసీయూలో ఉంచి మెరుగైన వైద్యం అందించారు. రూ.లక్షల్లో ఖర్చయ్యే వైద్యం ఉచితంగా అందించడంతో బాధితుడు త్వరగా కోలుకున్నాడు. గురువారం అతన్ని డిశ్చార్జి చేశారు.



దేవేందర్‌రెడ్డి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న శంకర్

డీజీపీని కలిసిన డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



డీజీపీ జితేందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌ను గురువారం నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు. నిర్మల్ జిల్లాలో ఏఎస్పీగా పనిచేసిన సమయంలో ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను గురువారం నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కె.శ్రీహరిరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు సబా కలీం, నగేష్‌రెడ్డి, అలెగ్జాండర్, మజహర్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రాష్ట్రబూత్ క్యాంపునకు

హాజరైన మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : హైదరాబాద్‌లోని బాలవికాస కేంద్రంలో ఇందిరా ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బూత్ క్యాంపుకు నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి హాజరయ్యారు. మంత్రి సీతక్క తదితర కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు పాల్గొన్నారు. మహిళా సాధికారిత, రాజకీయాల మార్పు అనే అంశంపై అవగాహన కల్పించారు.

రుణమాఫీ కాని రైతుల

వివరాలు ప్రత్యేక పోర్టర్‌లో నమోదు

నర్సాపూర్(జి), ఆగస్టు 29 : వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి వివరాలను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల పూర్తి వివరాలను మండల వ్యవసాయశాఖ అధికారి రాంచందర్ నాయక్ ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశానుసారంగా క్రాప్‌లోన్ , వీవర్స్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరచారు. బ్యాంకర్ల కారణంగా జరిగిన తప్పిదాలు, కుటుంబ నిర్ధారణ కానివి, మిస్సింగ్ డేటా, రేషన్ కార్డు లేని వారికి, ఒకే రేషన్ కార్డుపై ఇద్దరు రుణం పొందడం, పట్టా పాస్ బుక్ లేకుండా రుణం పొందడం, పాస్ బుక్ సమర్పించకపోవడం వంటి కారణాలను గుర్తించి వివరాలను ఆయా పోర్టల్ పొందుపరుస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖా అధికారి రాంచందర్‌నాయక్ వెల్లడించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రేషన్ కార్డులేని కుటుంబాలు కుటుంబ సభ్యులు వచ్చి వ్యవసాయ శాఖా అధికారులతో పోటోలు దిగాల్సిఉంటున్నారు. రైతులు నేరుగా కూడా కలిసి దరఖాస్తు ఇవ్వోచ్చు. బ్యాంకుల్లో ఉన్న లోను వివరాలు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలు జత చేసి ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారులు చెంద్యాల గణేష్, రమ్య, భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

రాచాపూర్‌లో ఆకస్మికంగా పర్యటించిన ఎంపీడీవో

లక్ష్మణచాంద, ఆగస్టు 29 : ఎంపీడీవో రాధారాథోడ్ మండలంలోని రాచాపూర్‌లో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని స్థానికుల ఇంటికి వెళ్లి పరిశుభ్రత గూర్చి వివరించారు. గ్రామ పంచాయతీ రికార్డులను, గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. దోమలు ప్రబలకుండా మురికినీటి కాలువలలో ఎప్పటికప్పుడు ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. వైద్య సిబ్బందితో మాట్లాడి మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట స్థానిక పంచాయతీ కార్యదర్శి వైద్య సిబ్బంది, స్థానిక ఉపా. ధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 29 : స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎన్నికల నిర్వహణకు గాను ప్రతీవార్డుకు ఒక పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు కోసం ఎంపీడీవో క్షేత్రస్థాయిలో పర్యటించి 650 ఓటర్లు మించిన వార్డులలో రెండవ పోలింగ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు గాను అవసరమైన జోనల్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్, ఎఫ్‌ఎస్‌టీవీఎస్‌టీఎస్‌ఎస్‌టీ సిబ్బంది ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఎలక్షన్ నిర్వహణ కొరకై బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచడానికి సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ప్రింటింగ్ ప్రెస్‌లను గుర్తించాలని దానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సెప్టెంబరు 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబరు 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందని తెలిపారు. ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ చట్టం 2018తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలని సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీడీవోలు తమ తమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించాలని, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో 600ల వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్లసంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.



సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో వీధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోను ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్‌లను నెలకొల్పి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడా లని సూచించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అలసత్వాన్ని ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు లెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ అర్బన్, ఆగస్టు 29 : గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై ఆమె జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో శాంతి సమావేశం (పీస్ కమిటీ) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద విద్యుత్, జనరేటర్ సౌకర్యం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా రహదారులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. రహదారుల వెంబ, మండపాల వద్ద ఎలాంటి విద్యుత్ లూజ్ వైర్లు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మల్ పట్టణంలో బంగల్‌పేట్ చెరువు వద్ద, అలాగే భైంసా పట్టణంలో గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద బారికేడ్లు, క్రేన్లు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి నిర్మల్ జిల్లాకు మంచిపేరు తీసుకొచ్చేలా మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో వినాయక ఉత్సవాలను ఘనంగా, శాంతియుతంగా జరుపుకునేలా పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలతో పాటు నిరంతరం పోలీసు బందోబస్తు, వాలంటీర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధిక శబ్దం వచ్చే డీజేలకు అనుమతిని ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బెల్ట్ షాపులను మూసివేసేలా పోలీసు ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శోభాయాత్ర సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మొబైల్ టాయిలెట్స్, అంబులెన్స్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకునేలా హిందూ, ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవోలు కోమల్ రెడ్డి, రత్న కళ్యాణి, డీఎస్పీ గంగారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేష్ కుమార్, మనోహర్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

● డీఈవో రవీందర్ రెడ్డి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

కుంటాల, ఆగస్టు, 29 : ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం లింబా (కే) హైస్కూల్ హెచ్‌ఎం నర్సయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడి వృత్తి ఎంతో కీలకమైందన్నారు. ఒక ఉపాధ్యాయుడు విద్యను సక్రమంగా బోధిస్తే ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశం ఉందని కావున క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణరావు, మాజీ సర్పంచ్‌లు అశోక్‌రెడ్డి, ఆనంద్‌రావుతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 29 : నిర్మల్‌లోని వశిష్ఠ ఇంపెల్స్ ఈ టెక్నో స్కూల్‌లో గురువారం ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఎంతో ఉంటుందన్నారు. చైర్మన్ జి.శ్రీనివాస్‌గౌడ్, కరస్పాండెంట్ మాధవి, డైరెక్టర్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడుగురామ్మూర్తి పంతులు, హాకీ క్రీడాకారులు ధ్యాన్ చంద్‌లకు ఘన నివాళులర్పించారు. వారి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై సర్వే

తానూర్ , ఆగస్టు 29 : మండల రైతులకు రుణమాఫీపై సర్వే నిర్వహించనున్నట్లు ఏఈవో పవన్ ప్రసాద్ తెలిపారు. రుణమాఫి ఉండి రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబాల వివరాలను నమోదు చేయడం, రుణమాఫి కాని రైతులు వివరాలను నిర్ధారణ చేయడానికి గ్రామాల వారిగా వ్యవసాయధికారుల బృందం సర్వే చేయనున్నట్లు తెలిపారు. రైతులు సర్వే అధికారులకు కుటుంబ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు, రుణమాఫి ఖాతా వివరాలను అధికారులకు సమర్పించాలన్నారు. 30వ తేదిన మహాలింగిం, బామ్నీ, భోసి, బేల్‌తరోడా, బోంద్రట్ గ్రామాల్లో , 31వ తేదిన హిప్నెల్లి, ఎల్వీ, హంగిర్గ-దాగన్ గ్రామాల్లో, వచ్చే నెల 2వ తేదిన ఖర్బాల, దౌల్తాబాద్, సింగన్‌గావ్ నందగావ్, జౌల తొండాల గ్రామాల్లో, 3వ తేదిన జౌలకే, కళ్యాణీ, మసల్గ మొగ్లి, వడ్‌గావ్ కుప్టి గ్రామాల్లో , 4వ తేదిన కోలూర్, తానూర్ గ్రామాల్లో, 5వ తేదిన ఎల్వత్ వడోనా గ్రామాల్లోని గ్రామపంచాయతీ లేదా రైతువేదిక కార్యాలయాల్లో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

'ఏఈవో సేవలు ప్రశంసనీయం'

ముథోల్, ఆగస్టు 29 : బ్రహ్మన్‌గావ్ క్లస్టర్ పరిధిలో పనిచేసిన ఏఈవో రిషికేష్ గత ఆరు సంవత్సరాలుగా చేసిన సేవలు ప్రశంసనీయమని బోరిగాం మాజీ సర్పంచ్ అమృత మురళి అన్నారు. ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో గురువారం ఏఈవో రిషికేష్ బదిలీపై వెళ్తుండడంతో ఘనంగా సన్మానించారు.